సాక్షి జోగులాంబ గద్వాల

మంగళవారం । 21 । నవంబర్ । 2023



దండిగ తరలొచ్చామయ్యా

కురుమూర్తిస్వామి జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు.

వివరాలు 4లో ▸



బాధ్యతగా ఓటేయాలి

ప్రతిఒక్కరు బాధ్యతగా ఓటేయాలని సాధారణ పరిశీలకుడు సంజయ్‌కుమార్ అన్నారు.

వివరాలు 4లో ▸

గరిష్టం/కనిష్టం 34.2 /23.1

వాతావరణం

ఉదయం, సాయంత్రం చలిగాలులు ఎక్కువగా వీస్తాయి. మధ్యాహ్నం నుంచి మేఘాలు దట్టంగా కమ్ముకుంటాయి.

న్యూస్‌రీల్

గడువులోగా ఖర్చుల లెక్కలు చూపాలి



అలంపూర్: అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు గడువులోగా తమ ఎన్నికల ఖర్చుల వివరాల లెక్కలు చూపాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు సమీర్ కుమార్‌ఝా అన్నారు. అలంపూర్ చౌరస్తా మార్కెట్ యార్డులోని సమావేశ మందిరంలో సోమవారం అభ్యర్థుల వ్యయ రికార్డుల పరిశీలన జరగగా.. సమావేశానికి ఆయనతోపాటు, ఎన్నికల రిటర్నింగ్ అధికారి చంద్రకళ హాజరయ్యారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీఎస్పీ, ఐఎన్‌సీ, ఎఐఎస్‌పీ, బీసీఐ రాజకీయ పార్టీలతోపాటు స్వతంత్ర అభ్యర్థుల రికార్డులను తనిఖీ చేశారు. అభ్యర్థులను ఒక్కొక్కరిని పిలిచి ఎన్నికల వ్యయ రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏబీసీ రిజిస్టర్‌లలో అన్ని ఖర్చుల నమోదు తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రచార సభలు, సమావేశాలు, ప్రచారానికి సంబంధించిన లెక్కలు జిస్టర్‌లలో నమోదు చేయాలన్నారు. అభ్యర్థులు సభలు, సమావేశాలు నిర్వహించడానికి 48 గంటల ముందే అనుమతి పొందాల్సి ఉంటుందని, రూ.10 వేల లోపు లావాదేవీలు, రూ.10 వేల పైన చెక్కుల ద్వార చేసిన లావాదేవీలు రోజు వారి వివరాలు తమ బ్యాంక్ ఖాతాలో నమోదై ఉండాలన్నారు.

వాహనాలకు అనుమతులు తప్పనిసరి

ఈ నెల 20, 24, 27 నిర్దేశించిన తేదీల్లో అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచార వ్యయ ఖర్చుల అందించిన రిజిస్టర్‌లలో పూర్తిగా పొందుపర్చాలన్నారు. అలా చేయకపోతే ఎన్నికల నిబంధనల మేరకు చర్యలు ఉంటాయన్నారు. అనుమతులు లేకుండా ఎన్నిల సభల్లో తిరిగే వాహనాలు తనిఖీ బృందాలు గుర్తిస్తాయని హెచ్చరించారు. సీ-విజిల్ యాప్‌ను ప్రతి పౌరుడు తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం స్ట్రాంగ్, ఎన్నికల సామగ్రిని పరిశీలించారు. జిల్లా ఉద్యానవన అధికారి అక్బర్, ఎన్నికల వ్యయ అధికారులు నరేందర్ రెడ్డి, మహేష్, వివిధ రాజకీయ ప్రతినిధులు, ఇతర అధికారులు ఉన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి

ధరూరు: జీవితంలో గొప్పగా ఎదగాలంటే ఉన్నత లక్ష్యంతో చదివితే మంచి భవిష్యత్తు ఉంటుందని జిల్లా బాలల సంరక్షణ అధికారి నర్సింహ అన్నారు. ప్రపంచ బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం సోమవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ పాఠశాలలో ఆయన పాల్గొని మాట్లాడారు. బాల్యం పిల్లల హక్కు అని వారందరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో పెరగాలని అన్నారు. ముఖ్యంగా లక్ష్యం పెట్టుకుని చదివితే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. తద్వారా తల్లిదండ్రులకు విద్యా బుద్దులు నేర్పిన గురువులకు మంచి పేరు వస్తుందన్నారు. పిల్లలు ఎలాంటి సమస్యలకు లోను కాకుండా ఉండాలన్నారు. బాల్య వివాహాలు, బాల కార్మికులు, అలాగే బాలలపై లైంగిక దాడులు, వేధింపుల నుండి రక్షణకు చిన్నప్పటి నుంచే చైతన్యం కావాలని, 1098 లేదా 100కు కాల్ చేసి రక్షణ పొందాలన్నారు. అలాగే చదువుతో పాటు క్రీడాల్లోనూ ముందుండాలని, వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఐసీపీఎస్ కౌన్సిలర్ సురేష్, స్పెషలాఫీసర్ యాదమ్మ, చైల్డ్ లైన్ జయన్న, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.





గట్టులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి (ఫైల్)



పార్టీల జోరు.. ప్రచార హోరు

- ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా పార్టీల వరుస సభలు
- బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ హోరాహోరీ ప్రచారం
- కార్యకర్తల్లో జోష్ నింపుతున్న అగ్రనేతల పర్యటనలు
- కేసీఆర్, అమిత్ షా, నడ్డా, రేవంత్‌రెడ్డి, కేంద్రమంత్రుల సభలతో వేడెక్కిన వాతావరణం
- ఎన్నికల ప్రచారానికి మిగిలింది వారమే

సాక్షి ప్రతినిధి మహబూబ్‌నగర్/సాక్షి, నాగర్‌కర్నూల్: ఉమ్మడి పాలమూరు జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో రాజకీయ పార్టీల ప్రచారం హోరెత్తుతోంది. ప్రధాన పార్టీల అభ్యర్థులు ఇప్పటి వరకు ఇంటింటి ప్రచారంలో నిమగ్నమై పని చేయగా, కొన్ని రోజులుగా పార్టీల ముఖ్య నేతలతో బహిరంగసభలను నిర్వహిస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ పార్టీల అగ్రనేతల సుడిగాలి పర్యటనలతో ఎన్నికల వాతావరణం రణరంగంలా మారింది. ఇప్పటికే ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత సీఎం కేసీఆర్ ఆదివారం ఒక్కరోజునే ఉమ్మడి పాలమూరులోని నాలుగు నియోజకవర్గ కేంద్రాల్లో బహిరంగ సభలను నిర్వహించారు. అలంపూర్, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో సీఎం పర్యటన ఆ పార్టీలో జోష్ నింపగా, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు సైతం జాతీయ, రాష్ట్రస్థాయి ముఖ్య నేతలతో సభల నిర్వహణకు సిద్ధమయ్యాయి.

పాలమూరుపై ప్రత్యేక నజర్..

ఉమ్మడి పాలమూరు జిల్లాలోని 14 నియోజకవర్గాలపై ప్రధాన పార్టీలన్నీ ప్రత్యేకంగా దృష్టిని సారించాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇప్పటికే పలుమార్లు పర్యటించారు. నెలరోజుల వ్యవధిలో జడ్చర్ల, అచ్చంపేట, నారాయణపేట, మక్తల్, దేవరకద్ర, గద్వాల నియోజకవర్గాల్లో పర్యటించగా.. ఆదివారం అలంపూర్, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి నియోజకవర్గాల్లో బహిరంగసభల్లో పాల్గొని మాట్లాడారు. అలాగే ఈనెల 22న మహబూబ్‌నగర్ జిల్లాకేంద్రంతో పాటు కోస్గికి కేసీఆర్ రానున్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు సంబంధించి మొదటి మోటారు ప్రారంభం, మార్కండేయ ఎత్తిపోతల నీటి పంపింగ్‌ను ప్రారంభించిన అనంతరం సాగునీటి అంశాన్ని తమకు అనుకూలంగా మలచుకోవాలని బీఆర్ఎస్ భావిస్తోంది. ఈ దిశగా భారీ బహిరంగసభల నిర్వహణతో పాటు గ్రామస్థాయిలో పెద్ద ఎత్తున ప్రచారం చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఇతర జిల్లాల్లో మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుల పర్యటనలు ఎక్కువగా కొనసాగుతుండగా, ఉమ్మడి పాలమూరులో గులాబీ దళపతి, సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా దృష్టి సారించి.. స్వయంగా ఆయనే పలు నియోజకవర్గాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారు.

నేడు నాగర్‌కర్నూల్, అచ్చంపేటకు రేవంత్..

కాంగ్రెస్ అభ్యర్థుల ప్రచారం ఇప్పటికే హోరెత్తగా, పోలింగ్‌కు సమయం దగ్గర పడుతుండటంతో గప్పగుత్తగా ఓటర్లను ఆకర్షించేందుకు భారీ బహిరంగసభలకు సిద్ధమవుతోంది. ఇప్పటికే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఉమ్మడి జిల్లాలోని కొల్లాపూర్, కల్వకుర్తి, జడ్చర్ల, షాద్‌నగర్‌లో పర్యటించారు. ప్రచారానికి మిగిలిన కొద్ది రోజుల్లోనూ పెద్ద సంఖ్యలో పార్టీ స్టార్ క్యాంపెయినర్లను రంగంలోకి దింపేందుకు కసరత్తు చేస్తోంది. మంగళవారం నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలోని బిజినేపల్లితో పాటు అచ్చంపేట నియోజకవర్గంలో నిర్వహించనున్న బహిరంగసభల్లో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాల్గొననున్నారు. ఉమ్మడి జిల్లాకు చెందిన రేవంత్‌రెడ్డి పాలమూరుపై గంపెడాశలు పెట్టుకున్నారు.

ప్రచారానికి దగ్గరపడుతున్న సమయం

అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి సమయం దగ్గరపడుతున్న వేళ ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో టెన్షన్ నెలకొంది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు పోటాపోటీగా ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సైతం ఇటీవల ఉమ్మడి పాలమూరు జిల్లాలో పర్యటించి బహిరంగసభల్లో పాల్గొన్నారు. అభ్యర్థుల ఎన్నికల ప్రచారానికి కేవలం వారం రోజులు మాత్రమే మిగిలి ఉండటంతో ప్రధాన పార్టీల ప్రచారం మరింత ఊపందుకుంది. సీఎం కేసీఆర్ సభలతో బీఆర్ఎస్, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్, ఏఐసీసీ కార్యదర్శులు, కర్ణాటక మంత్రులు, స్టార్ క్యాంపెయినర్లతో కాంగ్రెస్ అగ్రనేతలు, బీజేపీ తరఫున కేంద్రమంత్రులు, జాతీయస్థాయి నాయకులు జిల్లాకు వస్తుండడంతో ఎన్నికల వాతావరణం రోజురోజుకీ వేడెక్కుతోంది.

కేంద్ర మంత్రులు, సీఎంలతో బీజేపీ..

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా భారీ బహిరంగ సభలను నిర్వహించి పెద్ద ఎత్తున ఓటర్లను ఆకర్షించేందుకు బీజేపీ సన్నద్ధమవుతోంది. గత నెలలో ప్రధాని నరేంద్రమోదీ మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన బహిరంగసభలో పాల్గొని.. ఎన్నికల శంఖారావాన్ని పూరించారు. ఆ తర్వాత కేంద్ర మంత్రులు, జాతీయస్థాయి నేతలతో సభలను నిర్వహించగా, మిగిలిన రోజుల్లోనూ ముఖ్య నేతలతో పాటు ఇతర రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానించి ప్రచారం చేపట్టేందుకు కసరత్తు చేస్తోంది. ఇటీవల గద్వాల నియోజకవర్గంలో కేంద్రమంత్రి అమిత్ షా, ఆదివారం నారాయణపేట నియోజకవర్గంలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నడ్డా బహిరంగసభల్లో పాల్గొన్నారు. సోమవారం కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ కొల్లాపూర్‌లో, బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ కల్వకుర్తి, జడ్చర్ల, మహబూబ్‌నగర్ నియోజకవర్గాల్లో పర్యటించారు. అయితే వచ్చే వారం కల్వకుర్తి నియోజకవర్గం పరిధిలో నిర్వహించే బహిరంగసభలో ప్రధాని నరేంద్రమోదీ లేదా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ హాజరవుతారని తెలుస్తోంది.

తెలంగాణ భవిష్యత్‌కు బీజేపీ భరోసా

- గత ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం ఎన్‌హెచ్ 167కె మంజూరు చేశా
- కానీ మీరు బీజేపీ అభ్యర్థిని గెలిపించలేదు.. ఈ సారైనా మాట నిలబెట్టుకోండి
- జోగుళాంబ నుంచి కొల్లాపూర్ మీదుగా దేవరకొండ వరకు మరో జాతీయ రహదారి
- కేంద్ర రోడ్లు, రవాణా శాఖ మంత్రి నితిన్‌గడ్కరీ



కొల్లాపూర్ సభలో అభివాదం చేస్తున్న కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీ, అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు

కొల్లాపూర్: 'గత ఎన్నికల సమయంలో నేను ఇక్కడికి వచ్చాను. బీజేపీ అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు నన్ను ఒక కోరిక కోరారు. కొల్లాపూర్‌కు జాతీయ రహదారి మంజూరు చేయాలని, సోమశిల వద్ద కృష్ణానదిపై వంతెన నిర్మించాలన్నాడు. ఆయనను గెలిపించండి. మీకు జాతీయ రహదారి మంజూరు చేస్తా అని చెప్పా. నేను ఇచ్చిన మాట ప్రకారం రూ.2,500 కోట్లు కేటాయించి 167కె జాతీయ రహదారిని మంజూరు చేశా. మొదటి విడత పనులు కూడా ప్రారంభమయ్యాయి. కృష్ణానదిపై ఐకానిక్ సస్పెన్సివ్ కేబుల్ బ్రిడ్జి నిర్మించేందుకు టెండర్లు పిలిచాం. కానీ, మీరు మాత్రం ఆ ఎన్నికల్లో మాట నిలబెట్టుకోలేదు. సుధాకర్‌రావు ఓడిపోయినా బాధపడకుండా మీకోసం పట్టుబట్టి మరీ జాతీయ రహదారి మంజూరు చేయించుకున్నారు. ఆయనను ఈ ఎన్నికల్లోనైనా గెలిపించండి. ఇచ్చిన మాట నిలబెట్టుకోండి' అని కేంద్ర రోడ్డు, రవాణాశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ అన్నారు. సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కొల్లాపూర్ పరివర్తన్ సభకు నితిన్‌గడ్కరీతో పాటు కేంద్ర మాజీమంత్రి పొన్న రాధాకృష్ణన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గడ్కరీ మాట్లాడుతూ బీజేపీ అభ్యర్థి సుధాకర్‌రావు మీ కోసం ఇప్పుడు కూడా కొన్ని కోర్కెలు కోరుతున్నారు. మీరు ఆయనను గెలిపిస్తే జోగుళాంబ శక్తిపీఠం నుంచి కొల్లాపూర్ మీదుగా దేవరకొండ వరకు మరో జాతీయ రహదారి మంజూరుకు నిర్ణయం తీసుకుంటామని, కృష్ణానదిపై వెల్టూరు- గొందిమళ్ల బ్రిడ్జి కం బ్యారేజీ కూడా అందులో ఉంటుందని పేర్కొన్నారు. కొత్త జాతీయ రహదారి నిర్మాణ పనుల భూమిపూజకు మళ్లీ ఇక్కడికి వస్తానని, మీరు కూడా నాకు ఇచ్చిన మాట నిలబెట్టుకొని సుధాకర్‌రావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సుధాకర్‌రావు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేరుస్తామన్నారు.

కృష్ణానదిపై నిర్మించే వంతెనలో పాదచారుల రహదారి కూడా ఉంటుందని, దానిపై నుంచి నదీ అందాలు తిలకించవచ్చని వివరించారు.

బ్రిడ్జి నిర్మాణ స్థల పరిశీలన

కొల్లాపూర్ బీజేపీ పరివర్తన్ సభకు విచ్చేసిన నితిన్‌గడ్కరీ సోమశిలకు వెళ్లారు. 167కే నేషనల్ హైవేలో భాగంగా కృష్ణానదిపై నిర్మించనున్న ఐకానిక్ సస్పెన్షన్ బ్రిడ్జి నిర్మాణ ప్రాంతాన్ని తిలకించారు. అనంతరం సోమేశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు.

తెలంగాణ భవిష్యత్‌కు బీజేపీ భరోసా ఇస్తుందని, బీజేపీతోనే తెలంగాణ సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

'ఒక్కసారి అవకాశం అడిగినా ఇవ్వలేదు. అయినా వెనకడుగు వేయకుండా ఐదేళ్ల పార్టీ మారకుండా.. ప్రజాసేవలోనే ఉన్నా.. కేంద్రాన్ని ఒప్పించి కొల్లాపూర్‌కు జాతీయ రహదారి తీసుకువచ్చా. నాకు ఒక్క అవకాశం ఇవ్వండి.. నన్ను గెలిపిస్తే కొల్లాపూర్‌కు రైల్వే లైన్ తీసుకువస్తా. వంద పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తానని, ఇచ్చిన మాట నిలబెట్టుకోలేకుంటే మీరు ఏ శిక్ష వేసినా నేను సిద్ధంగా ఉంటానని బీజేపీ అభ్యర్థి ఎల్లేని సుధాకర్‌రావు అన్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా నుంచి కొల్లాపూర్ మీదుగా దేవరకొండకు జాతీయ రహదారి, కొల్లాపూర్‌కు పారిశ్రామిక కారిడార్ మంజూరు చేయాలని నితిన్ గడ్కరీని కోరారు. కులమతాలు, పార్టీలకతీతంగా ప్రజలకు సేవచేసేది బీజేపీ అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రీనివాస్‌యాదవ్, శేఖర్‌గౌడ్, చిన్నమల్లయ్య, రామన్‌గౌడ్, అశోక్‌రెడ్డి, జలాల్ శివుడు, రమేష్, కేతూరి నారాయణ, రోజారమణి, సింగోటం రామన్న, మూలె భరత్‌చంద్ర, గంగం మల్లేష్‌యాదవ్, కాశీపురం మహేష్, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన అవసరం

- ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి
- శిక్షణ తరగతుల్లో సందేహాలు నివృత్తి చేసుకోవాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

ఎర్రవల్లిచౌరస్తా: ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పీఓ, ఏపీఓలు ఈవీఎంల పనితీరుపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. సోమవారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని ఏకశిల పాఠశాలలో అలంపూర్ నియోజకవర్గంలో ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు అందిస్తున్న శిక్షణ తరగతులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారులకు పలు సూచనలు, సలహాలను అందించారు. శిక్షణ పొందిన పీఓ, ఏపీఓలు పోలింగ్ బూత్‌లతో సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ చేపట్టాలని, ఎలాంటి సందేహాలున్నా శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్‌లచే నివృత్తి చేసుకోవాలన్నారు. శిక్షణ తరగతులను అర్థం చేసుకోవడంతో పాటు ఎన్నికల విధులకు సంబంధించిన అన్ని అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. జాగ్రత్తగా విధులు నిర్వహిస్తే ఎలాంటి తప్పులకు ఆస్కారం ఉండదదని, ఏజెంట్ల సమక్షంలో మాక్ పోలింగ్‌ను ఉదయం 5.30 గంటలకు చేపట్టాలని, తర్వాత ఇన్ఫర్మేషన్ మొత్తం క్లియర్ చేసుకోవాలన్నారు. ఉదయం 7గంటల నుంచి పోలింగ్ ప్రారంభించాలని, ఆ సమయంలో కేంద్రాల్లో పాటించాల్సిన నిబంధనలు, కంట్రోల్ యూనిట్, వీవీప్యాడ్‌లను సీల్ చేయడం, తదితర అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ సుబ్రమణ్యం, ఏపీడీ నాగేంద్రం, ఎంపీడీఓలు రాఘవ, రవీంద్ర, తహసీల్దార్ నందిని, మంజుల, ఎంపీఓ భాస్కర్, ఆయా మండలాల ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, తదితరులు ఉన్నారు.

జిల్లాలో 80శాతం పీపీఆర్ వ్యాక్సినేషన్

గద్వాల వ్యవసాయం: జీవాల్లో పారుడు వ్యాధి నివారణ కోసం 20రోజులుగా పశుసంవర్ధకశాఖ చేపట్టిన ఉచిత పీపీఆర్ వ్యాక్సినేషన్ కార్యక్రమం సోమవారం ముగిసింది. ఆ శాఖ సిబ్బంది ప్రత్యేకంగా బృందాలుగా ఏర్పడి ఆయా గ్రామాల్లో గొర్రెలు, మేకలకు పీపీఆర్ వ్యాక్సిన్ వేశారు. 4,57,966 గొర్రెలకు, 38,327 మేకలకు వ్యాక్సిన్ వేసినట్లు జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వర్లు తెలిపారు. కలుషితమై మేత, నీరు తాగడం వల్ల జీవాలకు పారుడు వ్యాధి వస్తుందని ఆయన చెప్పారు. ఈ పారుడు వ్యాధి అంటువ్యాధి అని, ఇది సోకితే జీవాలు తీవ్ర అనారోగ్యానికి గురి అవుతాయన్నారు. జీవాలు ఈవ్యాధి భారిన పడకుండా ముందస్తుగా పీపీఆర్ వ్యాక్సినేషన్ చేపట్టామని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న జీవాల్లో 80శాతం జీవాలకు వ్యాకినేషన్ వేసినట్లు తెలిపారు.



కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: రాష్ట్రంలో శాసనసభకు జరుగుతున్న ఎన్నికలకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తూ ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుంది. డిసెంబర్ 3న ఓట్లను లెక్కించేందుకు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 11 అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి కౌంటింగ్ కేంద్రాలను ఖరారు చేశారు. కొడంగల్ నియోజకవర్గం వికారాబాద్, కల్వకర్తి, షాద్‌నగర్ నియోజకవర్గాల కౌంటింగ్ రంగారెడ్డి జిల్లాల పరిధిలో జరగనుంది.

అసెంబ్లీ నియోజకవర్గం	లెక్కింపు కేంద్రం
మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర	మహబూబ్‌నగర్ రూరల్ మండలం ధర్మాపూర్ సమీపంలోని జేపీఎన్‌సీఈఓని డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం భవనం
నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కొల్లాపూర్	నాగర్‌కర్నూల్‌లోని నెల్లికొండ వద్ద ఉన్న అగ్రికల్చర్ మార్కెట్‌యార్డులోని గోదాం
వనపర్తి	చిట్యాలలోని కొత్త మార్కెట్ గోదాం
గద్వాల, అలంపూర్	గద్వాల సమీపంలోని గోన్‌పాడ్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల
నారాయణపేట, మక్తల్	సింగారం క్రాస్‌రోడ్డులోని శ్రీదత్త బృందావన్ టీచర్ ఎడ్యుకేషన్ ఇనిస్టిట్యూట్

వేరుశనగ క్వింటా రూ.8,040

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు సోమవారం 2,639 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్ఠం రూ.8,040, కనిష్ఠం రూ.4,275, సరాసరి రూ.6,266 ధరలు పలికాయి. అలాగే, 232 క్వింటాళ్ల ఆముదం రాగా, గరిష్ఠం రూ.5419, కనిష్ఠం రూ.4908, సరాసరి రూ. 5369 ధరలు వచ్చాయి. దీంతోపాటు 1354 క్వింటాళ్ళ వరి (సోన) రాగా గరిష్ఠం రూ.2721 ధర పలికాయి.

ఖాతాలపై కన్ను..

ఎన్నికల్లో డబ్బు పంపకాలకు అడ్డుకట్ట

- అనుచరులు.. బంధువుల వ్యక్తిగత ఖాతాలే లక్ష్యం
- బ్యాంకు అధికారులు, బంగారు దుకాణాల యజమానులకు దిశా నిర్దేశం
- పోలీసుల విస్తృత తనిఖీలు.. రూ.1.13కోట్ల నగదు సీజ్



గోల్డ్‌స్మిత్ వ్యాపారులతో మాట్లాడుతున్న ఎస్పీ (ఫైల్)

గద్వాల క్రైం: ఎన్నికల్లో అభ్యర్థుల డబ్బు పంపకాలకు అడ్డుకట్ట వేసేందుకు ఎన్నికల కమిషన్, జిల్లా అధికార యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా అభ్యర్థులు, వారి బంధువుల బ్యాంకు ఖాతాలపై నిఘా ఉంచారు. ఓటర్లను తమ వైపు తిప్పుకునేందుకు డబ్బు, వెండి వస్తువులు, బహుమతులు తదితర వాటి పంపకాలకు యత్నిస్తుండగా.. మరోవైపు ప్రశాంతమైన వాతావరణంలో ఓటర్లు తమకు నచ్చిన పార్టీ అభ్యర్థికి ఓటు వేసేలా ఎలక్షన్ కమిషన్ జిల్లా యంత్రాంగాన్ని హై అలర్ట్ చేసింది. అందులో భాగంగా గత నెల 25వ తేదిన ఎస్పీ రితిరాజ్ బ్యాంకు అధికారులు, గోల్డ్‌స్మిత్ వ్యాపారులతో సమావేశం నిర్వహించి పలు అంశాలపై దిశనిర్దేశం చేశారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు రూ.కోటి 13లక్షల నగదు, 2948.765 లీటర్ల మద్యం సీజ్ చేశారు.

నగదు లావాదేవీలపై నిఘా

గద్వాల, అలంపూర్ స్థానాలకు ఎన్నికలు నిర్వహిస్తుండగా.. కొందరు అభ్యర్థులు ఎన్నికల్లో గెలవాలనే లక్ష్యంతో పార్టీలలో కార్యకార్తల రూపంలో చేరికలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున డబ్బులు చేతులు మారుతున్నాయనే నిఘా వర్గాలు గుర్తించాయి. బంధువులు, అనుచరుల ఖాతాల్లో పొదుపు చేసిన సొమ్మును పెద్ద మొత్తంలో డ్రా చేస్తున్నారని తెలిసింది. మరో వైపు గోల్డ్‌స్మిత్ వ్యాపారులతో ముక్కుపుడకాల కోసం సైతం పెద్ద ఎత్తున నాయకులు డబ్బులు చెల్లించేందుకు ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు అధికారులు గుర్తించారు. మద్యం వ్యాపారులకు సైతం నగదు చెల్లింపులు చేసినట్లు నిఘా వర్గాల రహస్య విచారణలో వెలుగులోకి వచ్చింది. నాయకులు ప్రచార కార్యక్రమాలతో బిజీబిజీగా ఉండడంతో బంధువులు, అనుచరులు ఓటర్లకు కావాల్సిన నగదు, మద్యం, వస్తు సామగ్రి కొనుగోలు అంశాలపై ఉన్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అభ్యర్థులకు సంబంధించిన బంధువులు, అనుచరుల బ్యాంకు ఖాతాలపై ఆదాయపు పన్నుశాఖ అధికారులు డేగ కన్ను పెట్టారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ బ్యాంకులలో కొన్నసాగుతున్న లావాదేవీలపై ఈడీ, ఐటీ, ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులను రంగంలోకి దింపి ఆడిటర్ల సహాయంతో రోజువారీ లావాదేవీలపై కూపీ లాగుతున్నారు. మరో వైపు పోలీసుశాఖ సైతం బ్యాంకు అధికారులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించి ప్రతి అంశాలను ఎప్పటికప్పుడు నివేదికాలు అందజేయాల్సిందిగా హెచ్చరించారు. ప్రతి వస్తువుకు బిల్లులు ఇవ్వాల్సిందేనని ఆదేశించారు.

తనిఖీలు.. నగదు పట్టివేతలు ఇలా

- ఈ నెల 9వ తేదిన గద్వాల మండలం అనంతపురం గ్రామ శివారులో పోలీసులు వాహన తనిఖీలు చేస్తున్న క్రమంలో రూ. 3.55లక్షల నగదును సీజ్ చేశారు.
- 4.11.2023న అలంపూర్‌లోని ర్యాలంపాడు చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు చేయగా రూ. లక్ష నగదును సీజ్ చేశారు.
- 3.11.2023న మానవపాడు మండలంలోని చంద్రశేఖర్ నగర్‌లో 195.34 లీటర్ల లీక్కర్ ఓ ఇంట్లో నిల్వ ఉన్నట్లు పోలీసులు గుర్తించి రూ. 1.50లక్షల మద్యం సీజ్ చేశారు.
- 3.11.2023న రాష్ట్ర సరిహద్దులైన కర్నాటక చెక్‌పోస్టు వద్ద పోలీసులు తనిఖీలు చేస్తున్న క్రమంలో రూ.3.22లక్షల నగదు సీజ్ చేశారు.

ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు



గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో ఎన్నికలు సజావుగా జరిగేందుకు అన్ని చర్యలు తీసుకున్నారు. వివిధ పార్టీల అభ్యర్థుల ప్రచార ఖర్చుల వివరాలు, బ్యాంకు ఆర్థిక లావాదేవీలపై నిఘా ఉంచాం. ఓటర్లను ఏ పార్టీ నాయకులైన ప్రలోభాలకు గురి చేస్తున్నట్లు వెలుగులోకి వస్తే చర్యలు తీసుకుంటాం. బ్యాంకు అధికారులు, గోల్డ్‌స్మిత్ వ్యాపారుల సమావేశంలో పలు అంశాలపై వారికి సూచనలు చేశాం. ఎన్నికలను శాంతియుత వాతవారణంలో నిర్వహిస్తాం.

– రితిరాజ్, ఎస్పీ

ఎప్పటికప్పుడు వివరాల సేకరణ

జిల్లాలోని గద్వాల, మల్దకల్, గట్టు, అయిజ, ధరూరు, శాంతినగర్, అలంపూర్, మానవపాడు, ఇటిక్యాల తదితర ప్రాంతాల్లో ఏర్పాటైన ఎస్‌బీఐ, ఆంధ్రాబ్యాంకు, ఏపీజీవీబీ, కార్పోరేష్ బ్యాంకు, కో - ఆపరేటివ్, యాక్సిస్, హెచ్‌డీఎఫ్‌సీ, ఐసీఐసీఐ బ్యాంకులు ఉన్నాయి. అయితే గత 25 రోజుల నుంచి జరిగిన లావాదేవీలపై ఈసీ ఆడిట్ నిర్వహిస్తున్నట్లు తెలిసింది. పెద్ద మొత్తంలో నగదు డ్రా చేసిన ఖాతాదారుల వివరాలను ఈసీ అధికారులు గుర్తించి వాటి చెల్లింపుల వ్యవహారంపై ఆరా తీస్తున్నారు. వ్యాపారుల క్రయ విక్రయాలు, సామగ్రి, వస్త, బంగారు, మద్యం, ఎలక్ట్రానిక్స్ పరికరాలు ఇతరత్రా కొనుగోళ్లపై కూపీ లాగుతున్నట్లు సమాచారం. పార్టీలకు చెందిన నాయకులు నిర్వహించే ప్రచార సభలు, ర్యాలీలు, సమావేశాలు, ఖర్చుల వివరాలను ఇప్పటి నుంచే అభ్యర్థులు లెక్కలు చూపించాల్సిందిగా ఈసీ అధికారులు ఆదేశాలు జారీ చేసింది. ఇదిలాఉండగా, జిల్లాలోని వివిధ పార్టీల నాయకులకు చెందిన ఇళ్లు, వ్యాపార, వాణిజ్య సముదాయాలపై సోదాలకు ఈసీ అధికారులు వ్యూహారచన చేస్తున్నారని సమాచారం.



దేశంలో మార్పు
కోరుకుంటే
మొదట అది నీ నుంచే
ప్రారంభం కావాలి.
- మహాత్మాగాంధీ

మీకు తెలుసా..



ఓటు వేసే ముందు ఎడమచెయ్యి చూపుడు వేలుకు సిరా చుక్క పెడతారనే విషయం అందరికీ తెలిసిందే. ఓటరుకు ఎడమచేతి చూపుడు వేలు లేకపోతే.? మరి ఏ వేలికి సిరా చుక్క పెడుతారనే ప్రశ్న తలెత్తవచ్చు. దీనికి ఎన్నికల సంఘం ప్రత్యామ్నాయం చూపింది. ఎడమచేతి చూపుడు వేలు లేకపోతే మధ్య వేలుకు, అదీ లేకపోతే బొటనవేలుకు సిరాచుక్క పెట్టే అవకాశం కల్పించింది. అసలు ఎడమ చేతికి వేళ్లే లేకుంటే.? కుడిచేయి చూపుడు వేలుకు, అదీ లేకుంటే మధ్యవేలుకు, ఆ తర్వాత ఉంగరం వేలు, చిటికన వేలు, చివరికి కుడిచేయి బొటన వేలుకు చుక్క పెడతారు. ఒకవేళ ఎడమ, కుడి చేతులకు వేళ్లు లేని పక్షంలో వేళ్ల మొదలు మధ్యభాగంలో లేదా చెయ్యి పైభాగంలో సిరా చుక్క పెడతారు. - పాన్‌గల్

జంగ్ తెలంగాణ

అచ్చంపేట.. అభివృద్ధికి దూరం

రూ.కోట్లు మంజూరైనా కనిపించని ప్రగతి

- అధ్వానంగా మారిన రహదారులు
- ప్రజలకు తప్పని ట్రాఫిక్ కష్టాలు
- ఆహ్లాదకర వాతావరణానికి దూరం

గ్రౌండ్ రిపోర్ట్

అచ్చంపేట: అచ్చంపేట సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోంది. ప్రజలు అనేక సమస్యల నడుమ సాహవాసం చేస్తున్నారు. కోట్లాది రూపాయలతో అభివృద్ధి చేశామని చెబుతున్నా.. ఆచరణలో మాత్రం ఎక్కడా కనిపించడం లేదు. చివరకు మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేసిన ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్‌వెజ్ మార్కెట్, స్మృతివనం, ఇండోర్ స్టేడియం, ఎన్టీఆర్ మినీ స్టేడియం పనులు ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారాయి. పట్టణంలో ప్రధాన రహదారితో పాటు అచ్చంపేట–లింగాల రోడ్డు విస్తరణ పనులను అసంపూర్తిగా వదిలేశారు.



విస్తరణకు నోచుకోని లింగాల రోడ్డు

ముందుకు సాగని స్టేడియాల పనులు..

పట్టణంలోని ఇండోర్, ఎన్టీఆర్ మినీ స్టేడియాలు ముందుకు సాగడంలేదు. దీంతో క్రీడాకారులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. రూ.60లక్షలతో చేపట్టిన ఇండోర్ స్టేడియం పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ప్రస్తుతం రెండు స్టేడియాల అభివృద్ధికి నిధులు మంజూరైనా పనులు ప్రారంభం కాకపోవడంలో ఆంతర్యమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

హామీగానే కృష్ణానది వంతెన..

నాగర్‌కర్నూల్–గుంటూరు జిల్లాల మధ్య కృష్ణానదిపై వంతెన ఏర్పాటు ప్రతిపాదనల్లోనే ఉంది. ఈ ప్రాంతం నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలు, ఎంపీలు వంతెన ఏర్పాటుపై మాట్లాడుతున్నారే తప్ప.. ఇచ్చిన హామీ నెరవేర్చడం లేదు. వంతెన నిర్మిస్తే కోస్తా ప్రాంతం తెలంగాణకు చేరువ అవుతుంది. గుంటూరు, విజయవాడ నుంచి కర్ణాటకలోని రాయచూర్ వెళ్లేందుకు మార్గం సుగమమవుతుంది.

ఇంటిగ్రేటెడ్ మార్కెట్ శంకుస్థాపనకే పరిమితం..

అచ్చంపేటలో 1.30 ఎకరాల విస్తీర్ణంలో రూ.4.50కోట్లతో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం చేపట్టేందుకు 2021 ఏప్రిల్ 14న మున్సిపల్‌శాఖ మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేసినా ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదు. మార్కెట్ నిర్మాణం చేపట్టేందుకు ఇరిగేషన్ శాఖకు సంబంధించిన 1.2 ఎకరాల స్థలం ఇటీవల మున్సిపాలిటీ ఆధీనంలోకి వచ్చింది. అందులోని చెట్లు, పాత భవనాలు తొలగించారు. శిథిలాలు తీయాల్సి ఉంది. ఇరిగేషన్ కార్యాలయం పక్కనే ఉన్న అటవీశాఖకు సంబంధించిన 28గుంటల భూమి ఇంత వరకు మున్సిపాలిటీ ఆధీనంలోకి రాలేదు. రూ.2.18కోట్లు చెల్లిస్తే.. ఆ స్థలం స్వాధీనం చేస్తామన్నారు. నిధుల మంజూరు ప్రభుత్వం వద్ద పెండింగ్‌లో ఉంది.



సమీకృత మార్కెట్ నిర్మించే స్థలంలో ఉన్న శిథిలాలు



కూరగాయల మార్కెట్‌కు వెళ్లే రోడ్డు ఇలా..



అసంపూర్తిగా ఉన్న ఇండోర్ స్టేడియం



అభివృద్ధికి నోచుకోని ఎన్టీఆర్ మినీ స్టేడియం

ప్రధాన సమస్యలు..

- అచ్చంపేట పట్టణంలో ప్రధాన జంక్షన్లు అభివృద్ధి చెందలేదు. ఫలితంగా ట్రాఫిక్ ఇక్కట్లతో ప్రజలు సతమతమవుతున్నారు. జంక్షన్లు, పుట్‌పాత్, డివైడర్ నిర్మాణ పనులు చేపట్టకపోవడంతో 2018లో కేటాయించిన టీయూఎఫ్ఐడీసీ నిధులు వెనక్కి వెళ్లాయి.
- భూగర్భ డ్రెయినేజీ పనులు మున్సిపల్ ఎన్నికల హామీగానే మిగిలింది. కొన్ని కాలనీల్లో ప్రజలే భూగర్భ డ్రెయినేజీ పైపులు వేసుకుంటున్నారు.
- అచ్చంపేట–లింగాల, నాగర్‌కర్నూల్–శ్రీశైలం, ఉప్పునుంతల ప్రధాన రహదారులు విస్తరణకు నోచుకోకపోవడంతో ట్రాఫిక్ ఇక్కట్లు తప్పడం లేదు.
- ప్రధాన రహదారి మినహా పట్టణంలో బైపాస్‌రోడ్డు లేకపోవడంతో ధర్నాలు, రస్తారోకోలు చేసినప్పుడు శ్రీశైలం మార్గంలో గంటల తరబడి ట్రాఫిక్ నిలచిపోతోంది.
- వర్షం వస్తే చాలు.. అచ్చంపేట–ఉప్పునుంతల మార్గంలోని గజవానికుంట వద్ద వరద నీటిలో రోడ్డు దాటడం కష్టంగా మారుతుంది. ఆర్టీసీ బస్టాండ్ ఎంట్రీ రహదారి నాలాపై కల్వర్టు నిర్మాణం చేపట్టకపోవడం వల్ల ప్రమాదకరంగా మారింది.
- అటవీశాఖ కార్యాలయం పక్కనున్న స్మృతివనం అభివృద్ధికి రూ.1.50కోట్లు మంజూరైనా ఇంత వరకు పనుల ఊసేలేదు. ఈ స్థలం ఇచ్చేందుకు అటవీశాఖ సుముఖంగా లేదు. ఇందులో ప్రతి ఏటా బతుకమ్మ, దసరా ఉత్సవాల కోసం రూ.లక్షలు ఖర్చుచేసి చేతులు దులుపుకుంటున్నారు. స్మృతివనం అభివృద్ధికి మంజూరైన నిధులను ఇతర పనులకు మళ్లించారు.
- పట్టణంలో మిషన్ భగీరథ పైపులైన్ పనులు పూర్తి కాకపోవడం, లీకేజీల సమస్యతో ప్రజలకు అరకొరగా తాగునీరు సరఫరా అవుతోంది.
- పట్టణంలో అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. సీసీరోడ్లకు నిధుల కొరతతో పనులకు ఆటంకం కలుగుతోంది. మురుగు రోడ్లపై ప్రవహిస్తోంది. చిన్నపాటి వర్షానికే రోడ్లు మొత్తం జలమయం అవుతున్నాయి.
- మున్సిపల్ పరిధిలో 1,468 మంది వీధి వ్యాపారులు ఉన్నారు. వీరి కోసం ప్రధాన రహదారి వెంట షెడ్ల నిర్మాణం స్థలాల ప్రతిపాదనల్లోనే మిగిలింది. వర్షాకాలం, ఎండకాలం వీధి వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనికి తోడు ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.
- పార్కులు లేక పట్టణ ప్రజలు ఆహ్లాదానికి దూరమయ్యారు. ఆయా కాలనీల్లో ఉన్న స్థలాలను యువజన, కులసంఘాలకు ధారదత్తం చేయడం వల్ల పార్కులను అభివృద్ధి చేయలేకపోతున్నారు. 2011 జూలై 21న మధురానగర్ కాలనీలో ఎన్టీఆర్ పార్కు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ స్థలంలో ఇప్పుడు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేశారు. పట్టణ నడిబొడ్డున ఉన్న సర్దార్ వల్లభాయ్ పటేల్ పార్కును విస్మరిస్తున్నారు.
- ఉప్పునుంతల మండలం మొల్గర వద్ద దుందుభీ వాగుపై హై–లేవల్ వంతెన నిర్మాణానికి గత జూలైలో రూ.35 కోట్లు మంజూరైనా పనులు ప్రారంభంకాలేదు. వర్షాకాలంలో ఈ రోడ్డుపై ప్రయాణం చేయలేని పరిస్థితి ఉంటుంది.
- పారిశుద్ధ్య సమస్య ప్రజలను వెంటాడుతోంది.
- లింగాల–చెన్నంపల్లి గ్రామాల మధ్య పెద్దవాగు, అచ్చంపేట మండలం మన్నెవారిపల్లి–చందంపేట రహదారిపై దుందుభీ వాగు దాటేందుకు వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటారు. ఏజెన్సీ గ్రామాల ప్రజలకు ఈ వంతెన అవసరం.

ఎన్నికల సిత్రాలు..

మిర్చి మీకే.. ఓటూ మీకే..



మహబూబ్‌నగర్‌లోని ఓ టిఫిన్ సెంటర్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మిర్చీలు వేయగా.. ఓ మహిళ మంత్రికి మిర్చీ తినిపించారు. - మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ

బతుకమ్మ.. గెలిపించమ్మా..



నవాబుపేట మండలం లింగంపల్లిలో జడ్చర్ల బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మహిళలతో కలిసి బతుకమ్మ ఆడి అందరినీ అలరించారు. - నవాబుపేట

చిన్నారితో సరదాగా..



తెలకపల్లి మండలంలోని గోలగుండంలో నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ముమ్మర ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓ చంటిపాపను ప్రచార రథంపైకి తీసుకున్నారు. - తెలకపల్లి

ఇస్త్రీ చేసి.. ఓట్లడిగి..



గద్వాలలో బీఆర్ఎస్ అభ్యర్థి కృష్ణమోహన్‌రెడ్డి కుమారుడు సాయిసాకేత్ రెడ్డి ఓ ల్యాండ్రీ షాపులో ఇస్త్రీ చేసి ఓట్లను అభ్యర్థించారు. - గద్వాల అర్బన్

పో'టీ'లో సరిలేరెవ్వరు!



మక్తల్‌లో కాంగ్రెస్ అభ్యర్థి వాకిటి శ్రీహరి ఓ టీ పాయింట్‌లో ఓటర్లకు స్వయంగా చాయ్ అందించి అందరినీ ఆకట్టుకున్నారు. - మక్తల్

నెట్టెంపాడుకు నీటి పంపింగ్

ధరూరు: జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి ఇన్‌ఫ్లో స్వల్పంగా కొనసాగుతున్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. అలాగే నెట్టెంపాడు ఎత్తిపోతల నీటి పంపింగ్ కొనసాగుతున్నట్లు అధికారులు చెప్పారు. సోమవారం ప్రాజెక్టుకు 2వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 90, ఎడమ కాల్వకు 1,030, కుడి కాల్వకు 724 క్యూసెక్కులు ప్రాజెక్టు నుంచి దిగువకు విడుదల చేస్తున్నారు.

ఎవరు గెలిచినా రికార్డే!

- బీఆర్ఎస్ విజయం సాధిస్తే హ్యాట్రిక్
- కాంగ్రెస్ గెలిస్తే పోటీచేసిన తొలిసారే విజయం
- బీజేపీ సుదీర్ఘకాలం తర్వాత గెలిచినట్లవుతుంది..



లక్ష్మారెడ్డి



అనిరుధ్‌రెడ్డి



చిత్తరంజన్‌దాస్

జడ్చర్ల టౌన్: ప్రస్తుత సాధారణ ఎన్నికల్లో ప్రధాన పార్టీల అభ్యర్థులు ఎవరు గెలిచినా రికార్డు నమోదవుతుంది. 1962లో జడ్చర్ల నియోజకవర్గం ఏర్పడగా.. మొత్తం 15సార్లు ఎన్నికలు జరిగాయి. 1996, 2008లో రెండు ఉపఎన్నికలు వచ్చాయి. ఇప్పటి వరకు ఏ ఒక్కరు కూడా వరుసగా మూడు సార్లు గెలవలేదు. 1972, 1978 ఎన్నికల్లో నర్సప్ప వరుసగా రెండు పర్యాయాలు విజయం సాధించగా, మూడవ సారి ఓటమిపాలయ్యారు. 1983, 1985 ఎన్నికల్లో కృష్ణారెడ్డి వరుసగా గెలిచి మూడవ పర్యాయం ఓడిపోయారు. ఆ తర్వాత 1996, 1999 ఎన్నికల్లో ఎర్రశేఖర్ వరుసగా విజయం సాధించి, 2004లో మూడవసారి ఓటమిపాలయ్యారు. 2014, 2018 ఎన్నికల్లో లక్ష్మారెడ్డి వరుసగా గెలుపొందగా.. ప్రస్తుతం ఆయన ఎన్నికల బరిలో ఉన్నారు. ఈ పర్యాయం గెలిస్తే హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా రికార్డు నెలకొల్పడంతో పాటు నియోజకవర్గంలో నాలుగో సారి ఎమ్మెల్యే అయిన ఘనత దక్కుతుంది. ఇక కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి విషయానికొస్తే.. ఎన్నికల బరిలో తొలిసారిగా నిలిచారు. ఆయన విజయం సాధిస్తే పోటీ చేసిన తొలిసారే విజయం సాధించినట్లవుతుంది. అదేవిధంగా బీజేపీ అభ్యర్థి చిత్తరంజన్‌దాస్ పోటీలో ఉన్నారు. ఆయన కల్వకుర్తి నియోజకవర్గం నుంచి రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి, ఓ పర్యాయం మంత్రిగా పనిచేశారు. 1985 ఎన్నికల్లో దివంగత ఎన్టీ రామారావును ఓడించి రాష్ట్రంలోనే పేరుగాంచారు. అదే స్ఫూర్తితో జడ్చర్లలోనూ విజయం సాధిస్తానన్న ధీమాలో ఉన్నారు. ఈ ఎన్నికల్లో ఆయన విజయం సాధిస్తే బీజేపీకి తొలి విజయంగా నిలుస్తుంది. ఆయన సుదీర్ఘకాలం తర్వాత గెలుపొందినట్లు అవుతుంది. జడ్చర్ల అసెంబ్లీ స్థానానికి 16వ సారి నిర్వహిస్తున్న సాధారణ ఎన్నికల్లో ఏ పార్టీ అభ్యర్థి గెలిచినా ఓ రికార్డుగానే చెప్పవచ్చు.

పెద్దపల్లిలో ఇరువర్గాల ఘర్షణ

- బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులపై కేసు నమోదు

మల్దకల్: ఎన్నికల ఇంటింటి ప్రచారంలో భాగంగా సోమవారం మండలంలోని పెద్దపల్లిలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తారస పడడంతో మాటామాట పెరిగి ఘర్షణకు దారి తీసింది. ఇదికాస్త పెద్దగా మారడంతో కార్యకర్తలు, నాయకులు ఒకరిపై మరొకరు చెప్పులు విసురుకోవడంతో పాటుగా పిడిగుద్దులు గుద్దుకునే దాకా వెళ్లింది. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన గ్రామానికి చేరుకుని, పరిస్థితిని అదుపులోకి తీసుకు వచ్చారు. ఘర్షణకు కారణమైన ఇరువర్గాలకు చెందిన వారిని శాంతింప చేసి, అక్కడి నుంచి వెళ్లగొట్టారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన అశోక్ గాయపడగా, అతన్ని గద్వాల ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అశోక్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు బీఆర్ఎస్ చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కల్యాణ్‌కుమార్ తెలిపారు. బీఆర్ఎస్ నాయకుల వారి ఫిర్యాదు మేరకు కాంగ్రెస్ పార్టీకి చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

చెక్‌పోస్టుల వద్ద నగదు పట్టివేత



పుల్లూరు చెక్‌పోస్టు వద్ద పట్టుబడిన నగదుతో ఎస్ఐ బాలరాజు

అలంపూర్: మండలంలోని పుల్లూరు చెక్‌పోస్టు వద్ద సోమవారం ఎస్ఐ బాలరాజు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేపట్టారు. కర్నూల్‌కు చెందిన రమణారెడ్డి అనే వ్యక్తి రూ. 2,97,400 నగదు తరలిస్తుండగా, పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కృష్ణా: మండలంలోని చేగుంట చెక్‌పోస్టు వద్ద రూ.లక్ష 50వేల నగదు పట్టుకున్నట్లు ఏఎస్ఐ సురేంద్రబాబు తెలిపారు. రాయచూర్ నుంచి చందాపూర్‌కు ఎలాంటి పత్రాలు లేకుండా తరలిస్తున్న నగదును పట్టుకుని నారాయణపేట గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఆటో బోల్తా: మహిళ మృతి

కొల్లాపూర్ రూరల్: ఆటో బోల్తా పడి మండల పరిధిలోని ఎన్మన్‌బెట్లకి చెందిన గంగమ్మ(45) ప్రమాదవశాత్తు మృతి చెందింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం ఉదయం కూరగాయలు ఆటోలో వేసుకుని వ్యాపార నిమిత్తం భర్త ఈదన్నతో కలిసి గంగమ్మ చుట్టు పక్కల ఉన్న గ్రామాలకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ఎన్మన్‌బెట్ల గ్రామ సమీపంలో స్టీరింగ్ విరిగిపోవడంతో ఆటో బోల్తా పడింది. ఆమెకు తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన కొల్లాపూర్ సివిల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందింది. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

అనుమానాస్పదంగా వ్యక్తి..

కొల్లాపూర్ రూరల్: పట్టణ సమీపంలోని ఈదమ్మ ఆలయం వద్ద ఉన్న కుంటలో పడి కుడికిల్లకు చెందిన చంద్రయ్య(50) అనుమానాస్పదంగా మృతిచెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆదివారం కొల్లాపూర్‌లో జరిగిన సీఎం కేసీఆర్ సభకు గ్రామం నుంచి వెళ్లాడు. సోమవారం ఉదయం పట్టణానికి సమీపంలోని కుంటలో శవమై కనిపించాడు. మృతుని తమ్ముడు సైదులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకు అప్పగించామన్నారు. మృతిపై అనుమానం ఉందని కుటుంబ సభ్యులు తెలియజేశారు.

మనస్తాపానికి గురై యువకుడి ఆత్మహత్య

బిజినేపల్లి: పురుగు మందు తాగి యువకుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాములు యాదవ్ తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని వెల్గొండకి చెందిన హరీష్(20)ను ఈ నెల 18న గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు దూషించడంతో మనస్తాపానికి గురై పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు. సంఘటనకు సంబంధించి మృతుడి అన్న నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వెల్లడించారు.

హరీష్(ఫైల్)

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు దుర్మరణం

మదనాపురం: మండల కేంద్రంలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని మొండి లక్ష్మి అలియాస్ జమ్ములమ్మ (72) మృతి చెందింది. ఎస్‌ఐ మురళీ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలాయపల్లికి చెందిన ఈమె నాలుగేళ్లుగా గ్రామంలో భిక్షాటన చేస్తుండేది. స్థానిక రైల్వే స్టేషన్ ఎదుట రోడ్డుపైన గుర్తు తెలియని మృతదేహం పడి ఉందని స్థానికులు చెప్పడంతో పరిశీలించామని, అప్పటికే వృద్ధురాలు మృతి చెందిందని తెలిపారు. వివరాలు సేకరించి బంధువులకు సమాచారం ఇచ్చామని పేర్కొన్నారు. మృతురాలి అక్క కూతురు ముత్యాలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

హన్వాడలో యువకుడు..

హన్వాడ: మండలంలోని చిన్నదర్పల్లి సమీపంలో వాహనం ఢీకొని యువకుడు మృతిచెందిన ఘటన సోమవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. మహమ్మదాబాద్‌కు చెందిన నరేష్ (34) వృత్తి రీత్యా జిల్లాకేంద్రంలో వడ్రంగి పని చేసేవాడు. ఈనెల 10న ఇంట్లోంచి వెళ్లి జిల్లా కేంద్రంలోని ఓ వ్యక్తి వద్ద పనిచేస్తూ ఉండేవాడు. 19న ఇంటికి వెళ్లి వస్తానని సదరు పనిలో కుదుర్చుకున్న వ్యక్తితో డబ్బులు తీసుకుని వెళ్లాడు. అలా వెళ్లిన వ్యక్తి చిన్నదర్పల్లి సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడు మద్యానికి బానిసై అప్పుడప్పుడు మద్యం మత్తులో ఇలా నడుచుకుంటూ వెళ్తుండేవాడని తెలిపారు. ఈ క్రమంలో ఒంటరిగా వెళ్తుండగా రాత్రి వాహనం ఢీకొని మృతి చెందినట్లు ఎస్‌ఐ రవినాయక్ తెలిపారు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష

అడ్డాకుల: మహిళపై లైంగికదాడికి పాల్పడిన నిందితుడికి పదేళ్ల జైలుశిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ సోమవారం 4వ ఏడీజే కోర్టులో న్యాయమూర్తి వై.పద్మ తీర్పునిచ్చినట్లు అడ్డాకుల ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. మండలంలోని కాటవరం గ్రామానికి చెందిన పాలెం పెద్ద ఆశన్న 2019 ఆగస్టు 24న అదే గ్రామానికి ఓ మహిళపై అఘాయిత్యానికి పాల్పడ్డాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్‌ఐ నరేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. 4వ ఏడీజే కోర్టులో వాదోపవాదాల అనంతరం నేరం రుజువు కావడంతో నిందితుడికి పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారని ఎస్‌ఐ తెలిపారు.


కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్న దుకాణాలు


మెట్లపై కొబ్బరికాయలు కొడుతున్న భక్తులు


ఉద్దాలను దర్శించుకుంటున్న భక్తులు

స్వామీ.. నీ సేవకే కురుమయ్య..
దండిగ తరలొచ్చామయ్యా

- కురుమూర్తిస్వామి జాతరకు పోటెత్తిన ప్రజలు
- జనవాహినితో కిటకిటలాడిన జాతర మైదానం
- దాసంగాలు, తలనీలాలతో మొక్కులు తీర్చుకున్న భక్తులు

చిన్నచింతకుంట: అమ్మాపురంలో వెలసిన కురుమూర్తిస్వామి జాతరకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఆదివారంతో బ్రహ్మోత్సవాలు ముగియగా.. సోమవారం మొదలైన జాతర దాదాపు నెలరోజులపాటు కొనసాగనుంది. ఈ క్రమంలో అర్చక సిబ్బంది ఆలయాన్ని శుద్ధిచేసి భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు.. ముందుగా కోనేరులో స్నానాలు ఆచరించి మెట్లపై కొబ్బరి కాయలు కొడుతూ గోవింద నామస్మరణలతో స్వామి చెంతకు చేరి ముడుపులు చెల్లించారు. కొండదిగువన దాసంగాలు పెట్టి తమ పిల్లాపాపలను చల్లంగా చూడాలని వేడుకున్నారు. కొందరు తలనీలాలు సమర్పించి మొక్కలు తీర్చుకున్నారు. తమ ఇంటి ఇలవేల్పుకు గండదీపాలు మోశారు. అనంతరం కొండపైన అలివేలు మంగమ్మ, ఆంజనేయస్వామి, ఉద్దాల మండపం, చెన్నకేశవస్వామి ఆలయాలను భక్తులు దర్శించుకున్నా రు. దీంతో జాతర ప్రాంగణమంతా భక్తుల రద్దీ నెలకొంది. జాతరలో పారిశుద్ధ్యం లోపించకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపడుతున్నారు.


జాతర మైదానంలో భక్తుల రద్దీ

తోపుడు బండ్లతో ఇబ్బందులు

జాతర మైదానంలో స్వామివారి ఆలయానికి వచ్చే ప్రధాన రోడ్డుపై తోపుడు బండ్లతో కొంతమంది చిరువ్యాపారులు పలు వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. వీరు రోడ్డుపై బండ్లను ఎటు పడితే అటు అడ్డంగా నిలుపుతూ స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. రోడ్డుకు మధ్యలో కాకుండా రోడ్డు పక్కన వ్యాపారాలు కొనసాగించుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

స్వామికి చక్రస్నానం

ఉత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి, అమ్మవార్లకు ఆలయ పూజారులు చక్ర స్నానం చేయించారు. తెల్లవారు జామున 5గంటలకు స్వామివారికి గరుడ, హనుమద్వాహన సేవలను నిర్వహించారు. స్వామివారి ప్రధాన ఆలయం నుంచి కోనేరు వరకు వాహన సేవ కొనసాగింది. అనంతరం పుష్కరిణిలో స్వామి అమ్మవార్లకు చక్రస్నానం చేయించారు.


గరుడ వాహనంపై ఊరేగుతున్న కురుమూర్తి స్వామి



తిరుగు ప్రయాణమైన తూర్పు కోడెలు

కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలు, జాతరను పురస్కరించుకుని తూర్పు కోడెల వ్యాపారం కొనసాగించేందుకు అచ్చంపేట, కొల్లాపూర్, నారాయణపేట జిల్లా మద్దూరు మండలం నుంచి తూర్పు కోడెలు తీసుకువచ్చారు. ఆదివారం ఉద్దాల ఉత్సవంలో వ్యాపారాలు కొనసాగించి సోమవారం తిరుగు ప్రయాణమయ్యారు.



స్వామి దర్శనానికి క్యూకట్టిన భక్తులు


ఆలయంలో కురుమూర్తిస్వామిని దర్శించుకుంటున్న భక్తులు


దీపాలు వెలిగిస్తున్న భక్తులు

శైవ క్షేత్రం.. ఓంకార నాదం

- భక్తుల నదీస్నానాలు, ఆపై అభిషేకాలు, కార్తీక దీపాలు


బ్రహ్మేశ్వర ఆలయంలో కార్తీక దీపాలు

జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్ దక్షిణకాశీ, శైవ క్షేత్రం, శక్తిపీఠం అయిన జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర నవబ్రహ్మ ఆలయాలు కార్తీక సోమవారం భక్తులతో కిక్కిరిశాయి. కార్తీక మాసం మొదటి సోమవారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అలాగే క్షేత్రంలో ప్రధాన దైవమైన బాలబ్రహ్మేశ్వరుడికి ఏకవార రుద్రాభిషేకాలు చేశారు. ఉదయం 5 గంటలకు ప్రారంభమైన ఈ అభిషేకాలు, సాయంత్రం 5 గంటల వరకు జరిగాయి. అలాగే జోగుళాంబ అమ్మవారి ఆలయంలో భక్తులు కుంకుమార్చనలు, త్రిశతి, ఖడ్గమాల వంటి పూజలు చేశారు.

కార్తీక వనభోజనాలు..

కార్తీక మాసం కావడంతో భక్తులు పుణ్యనది స్నానాలతో పాటుగా కార్తీక దీపాలను వెలిగించారు. బ్రహ్మేశ్వర ఉద్యానవనంతో చెట్ల కింద కార్తీక భోజనాలు చేశారు. మరికొంత మంది ఉసిరిచెట్టుకు పూజలు చేసి అక్కడే భోజనాలు చేశారు. ఇదిలా ఉండగా.. స్వామివారు కొలువుదీరిన బాలబ్రహ్మేశ్వర గర్భాలయంలో కార్తీక తొలి సోమవారాన్ని పురస్కరించుకుని ఓంకారకృతిలో కార్తీక దీపాలు వెలిగించారు. దీంతో బ్రహ్మేశ్వరుడికి గర్భాలయం స్వర్ణకాంతులను సంతరించుకుంది.


అభిషేకాలు చేస్తున్న భక్తులు

బాధ్యతగా ఓటు వేయాలి

- ఎన్నికల సంఘం సాధారణ పరిశీలకుడు సంజయ్‌కుమార్ మిశ్ర
- పీయూలో విద్యార్థులకు అవగాహన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఈనెల 30న నిర్వహించనున్న రాష్ట్ర శాసనసభ ఎన్నికల పోలింగ్‌లో ప్రతి విద్యార్థి బాధ్యతగా పాల్గొని ఓటు వేయాలని కేంద్ర ఎన్నికల సంఘం సాధారణ పరిశీలకుడు సంజయ్‌కుమార్ మిశ్ర అన్నారు. పాలమూరు విశ్వవిద్యాలయంలో సోమవారం నిర్వహించిన ఓటరు అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఓటర్లు స్వేచ్ఛగా, ప్రశాంత వాతావరణంలో ఓటు వేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలన్నారు. 30న సెలవుదినంగా ప్రకటించినందున ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటింగ్‌లో పాల్గొనడంతో పాటు తమ తల్లిదండ్రులు, చుట్టుపక్కల వారు ఓటు వేసేవిధంగా అవగాహన కల్పించాలని సూచించారు. ఓటరు హెల్ప్‌లైన్‌తో ఓటు వివరాలతో పాటు పోలింగ్ కేంద్రం వివరాలను తెలుసుకోవచ్చని, ఎన్నికల్లో చోటుచేసుకునే అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు సీ–విజిల్ వంటి యాప్‌లను వినియోగించుకోవాలని ఆయన చెప్పారు. ప్రజాస్వామ్యంలో ఓటుకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని, సరైన నాయకులను ఎన్నుకునేందుకు నిర్వహించే పోలింగ్ ఒక పండుగ లాంటిదన్నారు. పోలింగ్ రోజున ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటలలోపు కచ్చితంగా కుటుంబ సభ్యులతో సహా వెళ్లి ఓటు వేయాలని పిలుపునిచ్చారు. ఈ విడత కేంద్ర ఎన్నికల సంఘం 80ఏళ్ల వయసు పైబడిన వారికి పోస్టల్ బ్యాలెట్ విధానాన్ని ప్రవేశపెట్టిందని, ఇందుకుగాను ఫాం–12డీ ఇస్తున్నట్లు తెలిపారు.



విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎన్నికల అధికారులు

- మహబూబ్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గ వ్యయ పరిశీలకుడు డాక్టర్ కుందన్‌యాదవ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటుకు అత్యంత ప్రాధాన్యత ఉందని, తన భవిష్యత్‌తో పాటు రాష్ట్ర, దేశ భవిష్యత్‌ను నిర్ణయించేది ఓటు మాత్రమేనని తెలిపారు. ఎన్నికల్లో డబ్బు, మద్యం వంటివి ప్రభావితం చూపకుండా స్వేచ్ఛగా, శాంతియుతంగా ఓటు వేసేలా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టిందన్నారు. అక్రమాలపై సీ–విజిల్ ద్వారా ఫిర్యాదు చేస్తే కేవలం 15 నిమిషాల్లో ఎఫ్‌ఎస్‌టీ బృందాలు ఘటనా స్థలానికి చేరుకుని పరిష్కరిస్తాయని తెలిపారు.
- పోలీస్ పరిశీలకురాలు ఇలక్కియా కరుణాగరన్ మాట్లాడుతూ కుల, మత, జాతి, వర్గ విభేదాలు లేకుండా ఓటింగ్‌లో అందరూ పాల్గొనాలని తెలిపారు. ఓటువేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రవినాయక్ మాట్లాడుతూ ఓటు విలువను తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించామని తెలిపారు. ఓటు శాతం పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు వివరించారు. డబ్బు, మద్యం వంటి వాటిని అరికట్టేందుకు సీ–విజిల్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం వంటి అంశాలను తెలియజేశారు. అనంతరం విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఓటరు అవగాహన కోసం 'నేను తప్పనిసరిగా ఓటు వేస్తా' అని చేపట్టిన సంతకాల సేకరణ ప్రచారాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో పీయూ వీసీ లక్ష్మీకాంత్ రాథోడ్, రిజిస్ట్రార్ గిరిజా మంగతాయారు, స్వీప్ నోడల్ అధికారి, డీఈఓ రవీందర్ తదితరులు పాల్గొన్నారు.


హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు

పౌరులను విస్మరించిన కారు, కమలం పార్టీలు


వనపర్తి రాజీవ్‌చౌక్‌లో మాట్లాడుతున్న జాగో తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఆకునూరు మురళి, పక్కన ప్రొఫెసర్లు

- జాగో తెలంగాణ రాష్ట్ర కన్వీనర్, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరు మురళి

గద్వాల అర్బన్/ వనపర్తి/ ఆత్మకూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేపటి దేశ భవిష్యత్ విద్యార్థులను విస్మరించి కమీషన్లు దండుకునే పనులకు ప్రాధాన్యమిచ్చాయని జాగో తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ ఆకునూరు మురళి ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆయన చేపట్టిన బస్ యాత్ర సోమవారం వనపర్తి జిల్లా కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన పట్టణ ప్రధాన కూడలి రాజీవ్‌చౌక్‌లో మాట్లాడారు. రాష్ట్రంలో విద్యా, వైద్యం వ్యవస్థలను దిగదార్చారని, భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉండాల్సిన నాణ్యమైన విద్యను అందని ద్రాక్షగా మార్చారని మండిపడ్డారు. తొమ్మిదిన్నర ఏళ్లలో విద్యాలయాల సంఖ్య తగ్గుతూ.. మద్యం షాపులు, బెల్టుషాపుల సంఖ్య పెరుగుతూ వస్తోందన్నారు. అసమర్థ, అబద్ధాల పాలన సాగిస్తున్న మోదీ సర్కారును, అవినీతి నియంతృత్వ కేసీఆర్ పాలనకు ఓటుతో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. తాము ఏ రాజకీయ పార్టీకి మద్దతు తెలిపేందుకు బస్‌యాత్ర నిర్వహించటం లేదని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ పేరిట రూ. వేలకోట్ల అవినీతికి తెరలేపారన్నారు.

అవినీతి, అహంకార పాలన..

ఓటర్ల చైతన్య బస్సుయాత్ర ఆత్మకూర్‌కు చేరుకుంది. అక్కడి నుంచి గద్వాలకు వెళ్లింది. గద్వాలలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి కార్యాలయంలో ఏఐఎఫ్‌బీ నియోజకవర్గ అభ్యర్థి రంజిత్‌కుమార్ ఆధ్వర్యంలో విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో కేసీఆర్ మూడో సారి గెలిస్తే 35 లక్షల మంది నిరుద్యోగులు, రైతులు, కౌలు రైతులు, ఇళ్లు లేని పేద ప్రజలు, కూలీలు, విద్యార్థులు గోసపడుతారన్నారు. అదేవిధంగా బీజేపీ ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాలు, దేశంలో ఇళ్లు లేని పేదలకు ఇళ్లు, ఆస్పత్రులు, పాఠశాలలు కట్టించకుండా మోసం చేశారన్నారు. ప్రజలు మద్యం, డబ్బులు ఇతర ప్రలోభాలకు లొంగకుండా నిజాయతీ, అభివృద్ధి, ప్రజా సమస్యలను పరిష్కరించే నాయకులను ఎన్నుకోవాలని సూచిస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే తెలంగాణ జాగో ఓటరు చైతన్య బస్సు యాత్రను చేపడుతున్నట్లు తెలిపారు.

కేసీఆర్ పోవాలి.. బీజేపీ రావాలి


మహబూబ్‌నగర్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఈటెల రాజేందర్

- ఒక ఇంట్లో ఇద్దరికి పింఛన్ మంజూరు చేస్తాం
- రాష్ట్రంలో ప్రతి వ్యక్తి తలపై రూ.1.25 లక్షల అప్పు
- లిక్కర్ విక్రయాల్లో దేశంలోనే నంబర్‌వన్
- మహబూబ్‌నగర్, హన్వాడ, జడ్చర్ల, వెల్దండ కార్నర్ మీటింగ్‌ల్లో ఈటల రాజేందర్

పాలమూరు/ జడ్చర్ల/ కల్వకుర్తి రూరల్/ హన్వాడ: రాష్ట్రంలో కేసీఆర్ పోవాలి.. బీజేపీ అధికారంలోకి రావాలని పార్టీ రాష్ట్ర ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. ఇప్పటి వరకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలన చూశామని.. ఇక చూడాల్సింది బీజేపీ పాలన అని, తెలంగాణలో వికసించే పార్టీ కమలం పువ్వు అన్నారు. సోమవారం ఆయన ఉమ్మడి జిల్లాలోని జడ్చర్ల, మహబూబ్‌నగర్, హన్వాడ, వెల్దండలో పార్టీ అభ్యర్థులకు మద్దతుగా నిర్వహించిన కార్నర్ మీటింగ్‌ల్లో పాల్గొని మాట్లాడారు. గతంలో రెండు నెలలకు ఒకసారి కరెంట్ బిల్లు కడితే.. ఇప్పుడు ఒకనెలలో రెండు నెలలకు సరిపడా బిల్లు వస్తోందన్నారు. బంగారు తెలంగాణ చేస్తానని మోసం చేసిన కేసీఆర్ పార్టీకి ఓటేస్తారా.. లేక ప్రతి పథకం ప్రతి గడపకూ చేర్చే మోదీకి ఓటేస్తారో తేల్చుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరిపై రూ.1.25 లక్షల అప్పు ఉందని, ఇంట్లో నలుగురు ఉంటే రూ.5 లక్షల అప్పు అందరి తలలపై పెట్టారన్నారు. కేసీఆర్ నిర్వాకంతో రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని ఆరోపించారు. రాష్ట్రంలో కేసీఆర్ సారా బంద్ చేయించి లిక్కర్ పెంచాడని, లిక్కర్ విక్రయాల్లో దేశంలో నంబర్‌గా నిలిచిందన్నారు. దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో ఏటా రూ.45 వేల కోట్ల లిక్కర్ అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. తెలంగాణ ప్రజలు ప్రేమకు లొంగుతారు తప్ప దౌర్జన్యాలకు కాదని, నిజాం అలాంటి వ్యక్తే నీరుగారిపోయిండని.. వీళ్లెంత.. వీళ్ల లెక్కెంత అన్నారు. అరచేతిలో స్వర్గం చూపించే కేసీఆర్ బూటకపు మాటలను నమ్మే స్థితిలో ప్రజలు లేరని పేర్కొన్నారు. తెలంగాణ గడ్డ మీద నిలిచేది గెలిచేది బీజేపీ అని.. పార్టీలు, జెండాలతో సంబంధం లేకుండా పాలమూరు ప్రజలను గొప్పగా చూసుకునే బాధ్యత నాది అని అన్నారు. తెలంగాణ అప్పుల ఊబిలో నుంచి బయటపడాలంటే బీజేపీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందన్నారు.

బీజేపీ అధికారంలోకి వస్తే..

తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తే డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టించే బాధ్యత తమది అని ఈటల అన్నారు. ఒక ఇంట్లో ఇద్దరు వృద్ధులు ఉంటే రెండు పింఛన్లు మంజూరు చేస్తామని, కుటుంబంలో ఎవరికైనా ఆరోగ్యం బాగా లేకుంటే రూ.10 లక్షల ఉచిత ఆరోగ్య బీమా సదుపాయం కల్పిస్తామని, రూపాయి ఖర్చు లేకుండా మీ పిల్లలను చదివించే బాధ్యత బీజేపీ ప్రభుత్వానిదే అన్నారు. ఓటర్లు ఆలోచించాలని.. ఓటు గొప్పవాళ్లకు వేస్తే గొప్పదవుతుందని, చెడ్డవాళ్లకు వేస్తే చెడు జరుగుతుందన్నారు. ప్రజల జీవితాలు మెరుగుపడాలంటే బీజేపీని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. మహబూబ్‌నగర్ బీజేపీ అభ్యర్థి మిథున్‌రెడ్డికి మీ ఓటు వేసి గెలిపిస్తే నన్ను గెలిపించినట్లేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి, బాలరాజు, జయశ్రీ, అంజయ్య, నారాయణయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఆచారికి అవకాశం ఇవ్వండి..

ఎన్నికల్లో ఓటమి చెందినా ధైర్యం కోల్పోకుండా ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం పోరాటం చేస్తున్న కల్వకుర్తి బీజేపీ అభ్యర్థి ఆచారిని ఆశీర్వదించాలని ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కర్ణాటక ఎమ్మెల్యే కృష్ణఆయక్, కండె హరిప్రసాద్, గోరెటి నర్సింహ, శ్రీను, కృష్ణయ్య, రామచంద్రారెడ్డి, శేఖర్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, రాంపాల్ నాయక్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.


వెల్దండలో కార్నర్ మీటింగ్‌కు హాజరైన ప్రజలు, కార్యకర్తలు